క్లుప్తంగా

ఎంపీడీవో విజయలక్ష్మికి సత్కారం

సంతనూతలపాడు: మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొందిన ఈదర విజయలక్ష్మిని మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ సురేష్‌బాబు, పలువురు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఏడు నెలలపాటు విజయలక్ష్మి సంతనూతలపాడులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై పొదిలి ఎంపీడీవోగా ఆమె బదిలీ అయ్యారు. అయితే నూతన ఎంపీడీవో విజయలక్ష్మి మే 31వ తేదీన ఉద్యోగ విరమణ కానున్నారు.

రుణాల దరఖాస్తులకు సమయం పొడిగించాలి

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తులకు సమయం పొడిగించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు చప్పిడి వెంగళరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులు నుంచి ఆన్‌లైన్‌లో తీవ్ర అంతరాయాలు ఏర్పడుతున్నాయని కావున ప్రభుత్వం దరఖాస్తులకు సమయాన్ని పొడిగించాలని డిమాండ్ చేశారు.

నేడు ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లు

చీమకుర్తి రూరల్: మండలంలోని కూనంనేని వారిపాలెంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం 24వ వార్షికోత్సవ సందర్భంగా వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభ మీదకు ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నగార్జున, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి శ్యామల, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు హాజరవుతారు. కావున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

వీధి లైట్లు వెలగక ప్రజల ఇక్కట్లు



గ్రామంలో వెలగని వీధిలైట్లు

ఒంగోలు సిటీ: రూరల్ పరిధిలోని పానకాలపాలెం గ్రామంలో వీధిలైట్లు వెలగకపోవడంతో ప్రజలు రాత్రిపూట అవస్థలు పడుతున్నారు. వీధిలైట్లు వెలగకపోవడంలో గ్రామస్తులు పంచాయతీ అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రాత్రిపూట వీధిలైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉందని.. బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సూర్య ఘర్‌తో విద్యుత్ వెలుగులు..

- పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన
- గృహ విద్యుత్ బిల్లులు ఆదా చేసుకునేందుకు మంచి అవకాశం
- ఇంటి పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు
- సబ్సిడీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం



సామర్థ్యం (లోడ్)	యూనిట్లు	ప్రస్తుతం వస్తున్న బిల్లు	నెలకు వచ్చే బిల్లు	ఆదా	అయ్యే ఖర్చు	రాయితీ
1 కిలో వాట్	120	రూ.500	రూ.100	రూ.400	రూ.80 వేలు	రూ.30 వేలు
2 కిలో వాట్	240	రూ.900	రూ.150	రూ.750	రూ.1.30 లక్షలు	రూ.60 వేలు
3 కిలో వాట్	360	రూ.2400	రూ.200	రూ.2200	రూ.1.90 లక్షలు	రూ.78 వేలు
4 కిలో వాట్	480	రూ.3550	రూ.250	రూ.3300	రూ.2.50 లక్షలు	రూ.78 వేలు
4 కిలో వాట్	600	రూ.4750	రూ.300	రూ.4450	రూ.3.10 లక్షలు	రూ.78 వేలు

ఒంగోలు సబర్బన్: ప్రస్తుత ఆధునిక కాలంలో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగిపోయింది. ఇంట్లో ప్రతి చిన్న పనికి విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తుంటాం. దీంతో విద్యుత్ బిల్లులు తడిసిమోపడవుతుంటాయి. దీని నంచి బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జిల్లాలోని గృహ విద్యుత్ వినియోగదారులకు ఇదో సదవకాశం. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీసీపీడీసీఎల్) అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గృహ విద్యుత్ బిల్లులో ఆదా చేయాలనుకుంటే ఈ పథకం ఎంతో ప్రయోజనకరమన్నారు. మీ ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ఇప్పుడు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుంది. ముఖ్యంగా ఏసీలు, గీజర్లు వాడి అధిక విద్యుత్ వినియోగించే విద్యుత్ వినియోగదారులకు ఎంతో ఉపయోగం. ఈ పథకానికి తక్కువ వడ్డీకే అన్ని బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వినియోగదారుడు 5 నుంచి 6 సంవత్సరాల్లో మూలధన వ్యయాన్ని తిరిగి పొందుతారు. దరఖాస్తు కోసం, మరిన్ని వివరాలకు పీఎం సూర్య ఘర్ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చు. స్థానిక విద్యుత్ సిబ్బందిని కాని, సమీప విద్యుత్ కార్యాలయాన్ని కానీ, టోల్ ఫ్రీ నంబర్ 1912న కానీ, ప్రకాశం జిల్లా ఎల్ఎమ్‌సీ నంబర్ 94408174914 సంప్రదించవచ్చు.

లాభాలు ఇలా..

- విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది.
- ఇంటి పైకప్పు చల్లగా ఉంటుంది.
- వాడకానికి మించి ఉత్పత్తి చేస్తే మిగులు విద్యుత్‌ని విద్యుత్ సంస్థలకు అమ్మడం ద్వారా ఆదాయం సంపాదించవచ్చు.
- పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు అవ్వచ్చు.
- ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే.
- ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవటానికి కనీసం 10 చదరపు మీటర్ల స్థలం అవసరం అవుతుంది.

అధికారులకు పనితీరే కొలమానం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న స్పెషల్ ఆఫీసర్ నారాయణరావు

మద్దిపాడు: అధికారులకు పనితీరే కొలమానంగా చూస్తారని మండల స్పెషల్‌ఆఫీసర్, డీఆర్‌డీఏ పీడీ టీ నారాయణరావు పేర్కొన్నారు. మండలం కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహిస్తున్న తీరు, అంగన్‌వాడీ సెంటర్‌లలో చిన్నారులకు ఆధార్ ఏర్పాటు చేస్తున్న తీరును ఆయన ఐసీడీఎస్ సీడీపీఓ ఇవాంజిలిన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్‌లో ఇళ్ల కట్టకుండా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ఏఈని ప్రశ్నించారు. పీసీలు రావాల్సి ఉందని హౌసింగ్ ఏఈ వివరించి తెలిపారు. అదే క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖను సమీక్షిస్తూ వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారంటూ ప్రశ్నించారు. ఆదేవిధంగా వివిధ శాఖల పనితీరును సమీక్షించి పని తీరు మెరుగు పరచుకోవాలంటూ సూచించారు. ముందుగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, వెలుగు పథకానికి సంబంధించి కార్యాలయాలు లేవని, వాటికి కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి స్థలం కేటాయించే విధంగా స్పెషల్ ఆఫీసర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీఓ వరప్రసాద్, తహశీల్దార్ నారాయణ రెడ్డి, అధికారులు పలువురు పాల్గొన్నారు.

తాగునీరు ఇవ్వండి మహాప్రభో.. !



స్పందనలో అర్జీ ఇస్తున్న వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు కోటిరెడ్డి, నాయకులు

మద్దిపాడు: తమకు తమ పశువులకు తాగునీరు ఇవ్వాలని గుండ్లకమ్మ నదీ పరివాహక ప్రాంత ప్రజలు గగ్గోలుపెడుగున్నారు. మండలంలోని మల్లవరం సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్ నిర్మాణం చేసిన క్రమంలో రిజర్వాయర్ కింది గ్రామాలైన నందిపాడు, కీర్తిపాడు, రాచవారిపాలెం, ఇనమమెళ్లూరు గ్రామాలకు నీటి సరఫరా అందించి తాగునీటి సమస్యలను పరిష్కరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈనేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాలకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క రోజు కూడా రిజర్వాయర్ నుంచి నీరు అందించకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు ఇనమనమెళ్లూరు ఎంపీటీసీ వాకా కోటిరెడ్డి నాలుగు రోజుల క్రితం తాగునీటి విషయమై ఇరిగేషన్ ఎస్ఈ, ఇతర ఉన్నతాధికారులను కలిసినా వారు స్పందించకపోవడంతో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. ఇప్పటికైనా రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేసి ప్రజలకు, జీవాలకు తాగు నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, సురేష్, సుబ్బారావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా ప్రగతి సాధించాం



డెంగీ వ్యాధిపై మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని 26 జిల్లాలో కర్నూలు, నంద్యాల, వైజాగ్, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో మాత్రమే డెంగీ ప్రబలంగా ఉందని.. జిల్లాలో మాత్రం డెంగీ ప్రబలకుండా వైద్య పరంగా మంచి ఫలితాలు సాధించామని జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతి ఏడాది మే 16వ తేదీన జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు, డెంగీ ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలలో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. డెంగీ జ్వరాలు ఏడిస్ అనే దోమ వలన ప్రబలుతుందని, ఈ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందన్నారు. డెంగీ నియంత్రణకు ఆరోగ్య, మున్సిపల్ శాఖలు కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంవో శ్రీవాణి, నవీవలి, మధుసూదనరావు, శ్రీనివాసులు, చల్ల ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహావిహార నిర్వహణ అప్పగించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బౌద్ధ ధర్మ ప్రచార కేంద్ర నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: బీహారు రాష్ట్రంలోని మహాబోధి–మహా విహార నిర్వహణను బౌద్ధ సంఘాలకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం నాయకులు మాట్లాడుతూ హిందు మహంతుల ఆధిపత్యం నుంచి విముక్తి చేయడానికి బౌద్ధ భిక్షువు బుద్ధగయలో ఫిబ్రవరి 12వ తేది నుంయి నిరవధిక నిరాహార దీక్ష రూపంలో ధర్మపోరాటం చేస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 100 కోట్ల మంది బౌద్ధులకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతునన మహా విహారం బ్రిటీషు పాలకుల కాలం నుంచి మనువాదుల ఆధిపత్యంలో బ్రాహ్మణీకరించబడుతుందన్నారు. 1895లో అనంతరం బీహారు ప్రభుత్వం బుద్ధ టెంపుల్ యాక్టు ద్వారా హిందువుల మెజార్టీని చట్టబద్ధం చేయడం శోచనీయం అని అన్నారు. 9 మంది సభ్యులలో 5 మంది హిందువులు ఉండటం వలన సంప్రదాయంగా బౌద్ధ కార్యక్రమాలు నిర్వహించడంలేదన్నారు. రాజ్యాంగం ప్రకారం ఏ మతానికి సంభంధించిన సంస్థలకు ఆ మతం వారే నిర్వాహకులకు ఉండాలన్నారు. కార్యక్రమంలో చుండూరి రంగారావు, గాండ్ల హరిప్రసాద్, చావలి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అమ్మనబ్రోలుకు లోకేష్

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు రానున్నారు. ఉదయం 8.45 గంటలకు మండలంలోని చదలవాడ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో 9.30 గంటలకు అమ్మనబ్రోలుకు చేరుకుంటారు. ఇటీవల హత్యకు గురైన టీడీపీ నేత, మాజీ నాగులుప్పలపాడు ఎంపీపీ వీరయ్య చౌదరి నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.

20వ తేదీన కార్మిక సమ్మె జయప్రదం చేయాలి



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏపీ ఆటో అండ్ టాలీ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ 20వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌లో రవాణా రంగానికి చెందిన కార్మికులు టైర్ బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చాక ఉద్యోగులు, కార్మికులు, ప్రజలపై విపరీతమైన బారాలను మోపిందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ చట్టాలను మార్చేసి లేబర్ కోడ్ తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఈ లేబర్‌కోడ్ అమలు జరిగితే రోడ్ల మీద వాహనాలు నడిపే పరిస్థితులు ఉండవన్నారు. రవాణారంగ కార్మికులకు ఉరితాడుగా మారిన ఎంయు చట్టాన్ని చట్ట సవరణ ఆపాలని, జీవో నెంబర్ 21 ప్రకారం ఆటో రవాణా కార్మికులకు వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు తిరుమలయ్య, అంగిరేకుల కోటేశ్వరరావు, రామిరెడ్డి, గాంధీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో సిబ్బంది చొరవ చూపాలి



అర్జీలను పరిశీలిస్తున్న అర్బన్ తహశీల్దార్ మధుసూదన్

ఒంగోలు సబర్బన్: అర్జీల పరిష్కారంలో సిబ్బంది చొరవ చూపాలని ఒంగోలు అర్బన్ తహశీల్దార్ పిన్నిక మధుసూదన్ సూచించారు. మంగళవారం ఆయన నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను డీటీ కొల్లిబోయిన అశోక్‌కుమార్, రూరల్ డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు, ఒంగోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకంఠ శ్రీనివాసరావులతో చర్చించారు. ఎవరి పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం వీఆర్వోలు అందరూ విధిగా తహశీల్దార్ కార్యాలయానికి రావాలన్నారు. అప్పుడే గ్రీవెన్స్ రోజు వచ్చే అర్జీదారులకు సరైన న్యాయం చేయగలమని సూచించారు. అంతకు ముందు ఒంగోలు అర్బన్ తహశీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మధుసూదన్‌రావు కొత్తపట్నం తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కొత్తపట్నం ఎఫ్ఏసీ ఇన్‌చార్జ్‌గా కూడా కొనసాగుతున్నారు. ఇక్కడ పనిచేసిన అర్బన్ తహశీల్దార్ నేలభట్ల వాసు వెలిగండ్లకు బదిలీపై వెళ్లారు.

సైన్స్‌తోనే మానవ వికాసం



చిన్నారులు చేత మ్యాజిక్ చేయిస్తున్న మెజీషియన్ రామన్

సంతనూతలపాడు: సైన్స్‌తోనే మానవ వికాసం సాధ్యమవుతుందని.. మూఢ నమ్మకాలు నమ్మకుండా ఉండాలని జేవీవీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం సంతనూతలపాడు సుందరయ్య భవన్‌లో జేవీవీ, ఐద్వా ఆధ్వర్యంలో ప్రకాశం బాలోత్సవంలో భాగంగా ఐదో రోజు ప్రముఖ మెజీషియన్ బీవీ రామన్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మ్యాజిక్‌పై శిక్షణ నిచ్చారు. ఈ సందర్భంగా కర్పూరం వెలిగించి నోట్లో వేసుకోవడం, నిప్పుల్లో నడవడం మహిమ కాదని నిరూపించి చేసి చూపించారు. అలాగే దెయ్యాలను బెలూన్లలో బంధించి అవి లేవని నిరూపించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు కోదాటి కోటేశ్వరరావు ఐద్వా మండల కార్యదర్శి ఎస్ మాలతి, చిన్నారులు పాల్గొన్నారు.

18 నుంచి ఉచిత కరాటే శిక్షణ

ఒంగోలు: బాలికలకు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు జపాన్ కరాటే అసోసియేషన్ జిల్లా చీఫ్ కోచ్, అధ్యక్షులు టీశ్రీనివాసరెడ్డి, టి.జయశ్రీరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 సంవత్సరాల వయస్సు పైబడిన 45 సంవత్సరాలలోపు మహిళలు ఇందుకు అర్హులు. వీరికి నాంచాక్ (కరాటే వెపన్ శిక్షణ) కార్యక్రమం స్థానిక డాక్టర్ పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ ఈనెల 18 నుంచి 31వ తేదీవరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 83417 58692 నంబర్‌లో సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మనోహరంగా శ్రీనివాస పద్మావతి పరిణయం



హాజరైన మహిళలు



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఒంగోలు మెట్రో: నయన మనోహరంగా శ్రీనివాస పద్మావతి పరిణయం నిర్వహించారు. మంగళవారం నగరంలోని సమతానగర్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో పద్మావతి పరిణయం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చూడచక్కగా కొలువుదీర్చి ముందుగా గణపతి పూజ, పుణ్యాహ వాచనం, కంకణధారణ, శ్రీనివాస పద్మావతులకు కల్యాణ క్రతువులు నిర్వహించారు. అనంతరం సహస్ర నామార్చన, కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు చేత పూజా కైంకర్యాలలో భక్తిశ్రద్ధల నడుమ జరిపించారు.

కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొని శ్రీనివాస పద్మావతి ఆశీస్సులను అందుకుని, తీర్థ ప్రసాదాలు సేకరించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి

ఒంగోలు టౌన్: ఆర్టీసీ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన ఒంగోలు ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో పరిసరాలు, ప్రయాణికుల గ్యాలరీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం ఎండలు మండిపోతున్నందున డిపోలో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. ఫ్యాన్లు సరిగా తిరగకపోవడం, తగిన న్ని ఫ్యాన్లు లేకపోవడం గమనించిన ఆయన వెంటనే ఫ్యాన్లు బిగించాల్సిందిగా ఆదేశించారు. డిపో పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచాలని, డిపో నుంచి రాకపోకలు సాగించే ప్రయాణీలకు తాగునీటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అలాగే పార్శిల్ సర్వీసులో అనేక లోపాలు జరుగుతున్నాయని, కస్టమర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పార్శిల్ లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సత్యనారాయణ, డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, కమర్షియల్ ఏటీఎం ఇన్‌చార్జి శివరామకృష్ణ, యూనియన్ నాయకులు రాధాకృష్ణ ఉన్నారు.

శిద్దా వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు



వెంకటేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి రూరల్: కృష్ణసాయి గ్రానైట్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు కృష్ణసాయి గ్రానైట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు వారి తల్లి హైమావతి, సతీమణి సూర్యకుమారి, అశిష్, గ్రానైట్ వర్కర్స్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించి 30 మంది రక్తదానం చేశారు. పాదాచారుల దాహార్తి తీర్చేందుకు రోడ్డుపై చలివేంద్రం ప్రారంభిచారు. గ్రానైట్ వర్కర్స్‌కు బోనస్ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్ సీపీ మండలపార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, డాక్టర్ బొద్దపాటి హరిబాబు, ఎర్రగుంట్ల మోహన్ డీ రామచంద్రారెడ్డి, రాజా, రాంబాబు, కమలాకర్, అప్పారావు, మురళి, ఆంజనేయులు తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.